సాక్షి
ఒడిశా
మంగళవారం । 7 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,08,999లు, బంగారం 2.66 గ్రాములు, వెండి 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



బడ్జెట్ కేటాయింపుల వినియోగం పుంజుకోవాలి

- 8లో



అధికారులకు వినతులు

- 8లో

న్యూస్‌రీల్

గంజాయితో ఇద్దరి అరెస్ట్



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

బరంపురం: దిగపండి నుంచి కారులో బరంపురం నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని ఎక్సైజ్ విభాగం అధికారులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేశారు. బరంపురం ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ముందుగా అందిన సమాచారం మేరకు పోలీసులు హింజిలికాట్–దిగపండి–బరంపురం 3రోడ్ల కూడలి కాలుసండపూర్ జంక్షన్‌లో కాపుకాసారు. దిగపండి వైపు నుంచి వస్తున్న కారుపై దాడి చేయగా, 5 బస్తాల్లో 135కిలోల గంజాయి పట్టుబడింది. అరెస్టయిన నిందితులు పశ్చిమబెంగాల్ లోని మిథనపూర్ జిల్లాకు చెందిన హరదన బెహరా, బిశ్వజిత్ దాస్‌గా గుర్తించారు. వారిని కోర్టులో హాజరు పరిచారు.

సహాయ నిరాకరణపై ఉపాధ్యాయుల హెచ్చరిక



సమావేశమైన యునైటెడ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్

భువనేశ్వర్: మెట్రిక్యులేషన్ పరీక్షల నిర్వహణలో సహకరించమని ఐక్య ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం హెచ్చరిక జారీ చేసింది. గత ఆరేళ్లుగా సర్వీసు పరిగణన, కేంద్రప్రభుత్వ లెక్కల ప్రకారం జీత భత్యాల చెల్లింపు, పాత పెన్షన్ వ్యవస్థ పునరుద్ధరణ ప్రధాన డిమాండ్లతో యునైటెడ్ ప్రైమరీ టీచర్స్ యూనియన్ దీర్ఘకాలంగా ఉద్యమిస్తోంది. రాష్ట్రప్రభుత్వం తరచూ హామీలు గుప్పిస్తూ దాట వేస్తోందని.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, యూనియన్ నాయకుల మధ్య పలు మార్లు చర్చలు జరిపినా ఉపాధ్యాయులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల దృష్ట్యా త్వరలో జరగనున్న మెట్రిక్ పరీక్ష నిర్వహణకు సహకరించకూడదని యునైటెడ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ సోమవారం జరిగిన అత్యవసర సమావేశంలో నిర్ణయించింది. రాష్ట్రప్రభుత్వం త్వరలో డిమాండ్లు నెరవేర్చకుంటే ఈనెల 15నుంచి నుంచి 3 రోజుల పాటు రాజధానిలో నిరవధికంగా నిరసన చేపడతామని హెచ్చరించారు. అనంతరం నిరవధిక సెలవులతో ఆందోళన చేపట్టాలని సమావేశంలో తీర్మానం చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



ఘటనా స్థలంలో గోవింద మాఝి మృతదేహం

రాయగడ: జిల్లాలోని కులుగా గ్రామం నుంచి ధంగిడిదొరా గ్రామానికి ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి, బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో డ్రైవర్ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతుడు డిమిరిఖొట్గా గ్రామానికి చెందిన గోవింద మాఝి(27), క్షతగాత్రుడు ఉదయ్ సింహ్ మాఝి(29)గా పోలీసులు గుర్తించారు. ట్రాక్టర్ కింద ఇరుక్కుపోవడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. తీవ్ర గాయలపాలైన ఉదయ్‌ను కాసీపూర్ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'రూ.5 వేల పింఛన్ అందించాలి'



ఆందోళన చేస్తున్న సురక్షా మంచ్ ప్రతినిధులు

బరంపురం: రాష్ట్రంలోని లబ్ధిదారులైన వృద్ధుల, దివ్యాంగులు, వితంతు పింఛన్లు రూ.5 వేలకు పెంచాలని మానవాధికారి సుర్క్షా మంచ్ కన్వీనర్ అబనీకుమార్ గయా కోరారు. ఈ మేరకు బరంపురం మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) కార్యలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. దీనిపై ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కటక్, భువనేశ్వర్ నగరాల తరహాలో బరంపురంలో కూడా అర్హులైన వృద్ధుల, దివ్యాంగులు, వితంతువులకు ప్రతి నెలా రూ.5 వేలను పింఛన్‌గా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఎంసీ కమిషనర్ సోనాలీ జెనాకు వినతిపత్రం అందజేశారు.

వేడుకగా ఉగాది నిర్వహిద్దాం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు



మాజీ ఎంపీ నెక్కంటి, ఎమ్మెల్యే పొడాల్‌తో తెలుగు సంఘాల ప్రతినిధులు

- రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు పిలుపు
- అవిభక్త కొరాపుట్, గజపతి జిల్లాల్లో తెలుగువారితో సమావేశం
- తెలుగు సినీ, టీవీ కళాకారులు రానున్నట్లు వెల్లడి

కొరాపుట్:

అవిభక్త కొరాపుట్, గజపతి జిల్లాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని బీజేడీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ప్రకటించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని స్పెషల్ సర్క్యూట్ హౌస్‌లో తెలుగు సంఘాల ప్రతినిధులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ ఒడిశాలో తెలుగు ప్రజల ఐక్యతను చాటేందుకు ఉగాది వేడుకల వేదికపై సంఘీభావం ప్రకటిస్తామన్నారు. ఇప్పటికే గజపతి, గుణుపూర్, రాయగడ, జయపూర్‌లో స్నేహక సమావేశాలు పూర్తి చేశామని తెలిపారు. మల్కన్‌గిరి, నవరంగ్‌పూర్‌లోని తెలుగు వారిని కూడా కలవనున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా తెలుగు ప్రజలంతా కలసి ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు.

ఒకే రోజు 7 పట్టణాలలో..

ఉగాది రోజు ఆయా పట్టణాల్లో తెలుగుతనం ఉట్టిపడేలా సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీలు, కార్యక్రమాలు నిర్వహిస్తామని నెక్కంటి తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి తెలుగు సినిమా, టీవీ కళాకారులను రప్పించి ప్రదర్శనలు ఇప్పిస్తామన్నారు. మెత్తం 7 ప్రధాన పట్టణాలలో ఉగాది రోజు కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యచరణ సిద్ధం చేశామని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఆయా ప్రాంతాల్లోని తెలుగు సంఘాలతో చర్చలు జరిపామన్నారు. ఉగాది వేడుక ఒడిశాలో తెలుగు ఐక్యత ప్రదర్శనకు నిదర్శనమని చాటుతామని విశ్వాసం వ్యక్తంచేశారు. సమావేశంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, కేసీసీబీ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రహి, డైరెక్టర్ తిరుపతి, నెక్కంటి దీపక్, పీవీపీ రాము, దూడల శ్రీనివాస్, కె.గణపతిరావు, సీనియర్ న్యాయవాది ముత్యాలరావు, జి.రామకృష్ణ, జి.గంగరాజు, కె.హేమారావు, టి.కిరణ్‌కుమార్, గజిని లక్ష్మణ్, ఎస్.రమేష్, ఆనంద మౌళి తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతను చాటాలి..

జయపురం: పట్టణంలో తెలుగు ప్రజలు సమైక్యంగా ఉగాది పండగ నిర్వహించాలని, అందుకు పూర్తి సహకారం అందిస్తామని మాజీ ఎంపీ నెక్కంటి స్పష్టంచేశారు. జయపురంలోని ఓ హోటల్‌లో పట్టణానికి చెందిన తెలుగు సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు వారికి ప్రధానమైన ఉగాది పండగను ఘనంగా జరిపేందుకు అంతా కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. అలాగే జిల్లాలోని తెలుగువారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో బీజేడీ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర పాణిగ్రహి, మాజీమంత్రి రబినారాయణ నందో, బీజేడీ సీనియర్ నాయకులు బి.బాలంకిరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకరరావు, ఆర్య వైశ్య మహాసంఘం అధ్యక్షుడు రవ్వా రామకృష్ణ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తెలుగు సంఘాల ప్రముఖులు, కౌన్సిలర్లు

జిల్లాలకు వర్ష సూచన

- రానున్న 3రోజులు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం



భువనేశ్వర్: రాష్ట్రంలో అత్యధిక జిల్లాల్లో గత వారం రోజులుగా పొడి వాతావరణం కొనసాగుతుండగా తాజా వాతావరణ మార్పుల ప్రభావంతో కొన్ని జిల్లాలకు వర్ష సూచన జారీ అయ్యింది. ఝార్సుగుడ, సుందర్‌గఢ్, సంబల్‌పూర్, దేవ్‌గఢ్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు లేదా ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) భువనేశ్వర్ ప్రాంతీయ కార్యాలయం సమాచారం సోమవారం జారీ చేసింది. బుధవారం నుంచి వచ్చే 3రోజుల పాటు కెంజొహర్, మయూర్‌భంజ్, నువాపడా, నవరంగపూర్, కలహండి జిల్లాల్లో ఈ వాతావరణం నెలకొంటుంది. గురు, శుక్రవారాల్లో సుందర్‌గఢ్, దేవ్‌గఢ్, ఝార్సుగుడ, సంబల్‌పూర్, అంగుల్, బర్‌గఢ్, నువాపడా, బొలంగీర్, కలహండి, కంధమల్, కెంజొహర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన వర్షం కురుస్తుందని ప్రకటించింది. ఇతర ప్రాంతాల్లో వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలో పెద్ద మార్పు లేకుండా రానున్న 4, 5 రోజుల్లో సాధారణం కంటే 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపింది. రానున్న 24 గంటలలో భువనేశ్వర్, పరిసర ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా ఉండి, ఉష్ణోగ్రతలు గరిష్టంగా 37 డిగ్రీలు, కనిష్టంగా 20 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో హోలీ పండుగ వర్ష ప్రభావితం అవుతుందని భావిస్తున్నారు.

మహిళా సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు



శిబిరంలో రైల్వే సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

భువనేశ్వర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఖుర్దారోడ్‌లో రైల్వే మహిళా సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. విధి నిర్వహణ రంగంలో బాధ్యతల నిర్వహణలో నిత్యం సతమతమయ్యే మహిళ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని తూర్పుకోస్తా రైల్వే మహిళా సంఘం(ఈకో రైల్వే) అధ్యక్షురాలు శుభలక్ష్మి జెనా పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈస్టుకోస్టు రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. ఇందులో 300మందికి పైగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. రుణి బెహరా, బి.జానకి, బిజయలక్ష్మి సాహు ఆధ్వర్యంలో మహిళా శ్రామిక్ కాంగ్రెస్ సభ్యులు విశేష సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవం వేడుకుగా జరుపుకొన్నారు. క్షేత్రస్థాయిలో తోటి మహిళా సిబ్బంది బాగోగులను ఈ బృందం పర్యవేక్షించింది.

భుషండ్‌పూర్‌లో బాణాసంచా పేలుడు



ఘటనా స్థలంలో గుమిగూడిన జనం

- బాణసంచా తయారు చేస్తూ నలుగురు దుర్మరణం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



సంతోష్ ఉపాధ్యాయ్, అగ్నిమాపక విభాగం డీజీ

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా టంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని భుషండ్‌పూర్‌లో బాణసంచా పేలుడు సంభవించింది. దీంతో నలుగురు మృతిచెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. సోమవారం ఉదయం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. హోలీ వేడుక సన్నాహాల్లో భాగంగా బాణసంచా తయారు చేస్తుండగా ఈ పేలుడు సంభవించిందని సమాచారం. తీవ్రంగా గాయపడిన వారిని ఖుర్దా జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్పించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, మంటలను అదుపు చేయడంతో పాటు సహాయక చర్యలు చేపట్టింది. ఈ పరిసరాల్లో 4 ఇళ్లు సైతం కాలి బూడిదయ్యాయి. జిల్లా కలెక్టర్ కె.సుదర్శన్ చక్రవర్తి అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాణసంచా తయారీకి ఎటువంటి అనుమతి లేనట్లు ప్రాథమిక సమాచారంగా పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోందని వెల్లడించారు.

మృతుల వివరాలు..

ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. ఇందులో భుషండ్‌పూర్ బెహెరా సాహికి చెందిన నిరంజన్ బెహెరా(45), బర్జు బెహెరా(20), బదురాబొరా గ్రామానికి చెందిన బందవన్ సాహు(70) లను పోలీసులు గుర్తించారు. మరో మృతుని ఆచూకీ తెలియాల్సి ఉంది.

ఉన్నతస్థాయి విచారణ

పేలుడు ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ప్రభుత్వం ఆదేశించారు. పూరీ జిల్లా అగ్నిమాపక అధికారికి విచారణ బాధ్యతలు కేటాయించినట్లు రాష్ట్ర అగ్నిమాపక విభాగం డైరెక్టర్ జనరల్ సంతోష్ ఉపాధ్యాయ్ తెలిపారు. బాణసంచా తయారీకి లైసెన్స్ ఉందా? లేకపోతే ఎవరి అనుమతితో నడుపుతున్నారు? ఈ కోణాల్లో విచారణలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. యజమాని హట్బా బెహరా కోసం గాలిస్తున్నారు.

సైంటిఫిక్ బృందం గాలింపు

భుషండ్‌పూర్‌లో బాణసంచా పేలుడు ఘటనా స్థలానికి సైంటిఫిక్ బృందం చేరింది. పేలుడు జరిగిన ఇంటిని సందర్శించి వివిధ పదార్థాలను స్వాధీనం చేసుకుంది. ఘటనా స్థలం నుంచి గన్‌పౌడర్, సల్ఫర్, బొగ్గు, సెల్లో టేప్, కాగితాలు, పురితాళ్లు వంటి పదార్థాల నమూనాలను ఈ బృందం సేకరించింది.




ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

రిజర్వ్ ఫారెస్ట్‌లో కార్చిచ్చు

- మంటలను అదుపు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

రాయగడ:

పట్టణానికి సమీపంలోని పితామహల్, కొట్లాగుడ, లద్ద ప్రాంతాల్లోని రిజర్వ్ ఫారెస్ట్‌లో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్, రాయగడ, గుణుపూర్, మునిగుడ, టికిరి ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా అడవుల్లో కార్చిచ్చు చెలరేగుతోంది. దీంతో వన్య ప్రాణులతో పాటు విలువైన ఔషధ మొక్కలు సైతం అగ్నికి ఆహుతవుతున్నాయి. మరోవైపు చంద్రపూర్, గుణుపూర్ ప్రాంతాల్లోని సంరక్షిత అడవుల్లో వన్యప్రాణులు జనవాసాల వైపు పరుగులు పెడుతున్నాయి. మరోవైపు విషపూరిత సర్పాల సైతం ఇళ్లల్లోకి వస్తున్నాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. 'అడవులను రక్షించండి. పర్యావరణానికి ఎంతగానో దోహద పడుతున్న వనాలను కాపాడండని ఇప్పటికే అటవీశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ సరైన ఫలితాలు ఇవ్వడం లేదు. సోమవారం రాయగడ పట్టణానికి సమీపంలోనే మంటలు చెలరేగడంతో అంతా అవాక్కయ్యారు. జిల్లాలో 77,337 హెక్టార్లలో 86రిజర్వ్ ఫారెస్ట్‌లు ఉన్నట్లు అటవీశాఖ గుర్తించింది. ఆయా ప్రాంతాల్లోని వన్యప్రాణులు, సంపదను రక్షించేందుకు నియమించిన ఫారెస్ట్ గార్డుల నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపించారు. అలాగే ప్రజల్లో చైతన్యం కరువవ్వడం కూడా మరో కారణమనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.



పితామహల్ వద్ద చెలరేగిన మంటలు



మంటలను అదుపు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

క్లుప్తంగా

టికిరిలో ప్రారంభమైన డోలోత్సవాలు



రాధాకాంత విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

రాయగడ: జిల్లాలోని టికిరి రాధాకంత మందిరంలో డోలోత్సవాలు ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. హోలీకి ముందుగా ఈ నిర్వహించే ఈ ఉత్సవాలు వారం రోజులు కొనసాగుతాయి. రోజూ ఉత్సవ విగ్రహాలను పట్టణంలో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు పాల్గొని, హరేరామ హరే కృష్ణ సంకీర్తనతో తిరువీధి నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం తరహాలోనే ఈ ఏడాది కూడా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పెంకుటిల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది, గ్రామస్తులు

సీతానగరం: మండలకేంద్రంలోని సుంకరివీధిలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సేపేన సింహాచలం(బ్రహ్మన్న) ఇంట్లో దేవుడికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి ఇంటితాళం వేసుకుని పొలం పనులకు బయటకు వెళ్లారు. 11 గంటలసమయంలో పెంకుటిల్లు పెంకుల్లోంచి మంటలు రావడాన్ని స్థానికులు గుర్తించారు. వీధిలో ఉన్న వారంతా నీళ్లతో మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేయడంతో అదుపులోకి వచ్చాయి. అప్పటికే ఇంటిపై కప్పుకలప కాలిపోవడంతో పాటు కొంతమేర సామగ్రి కాలిపోయింది. సమాచారం మేరకు బొబ్బిలి అగ్ని మాపక శకటంతో వచ్చిన సిబ్బంది పూర్తి స్థాయిలో మంటలను అదుపు చేశారు. మంటలు రేగుతున్న సమయానికే తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎస్సై కె.నీలకంఠం. సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేయడానికి ,ఇంట్లో ఉన్న సామగ్రి బయటకు తీయడానికి సహకారం అందించారు.

ఆర్పీ అక్రమాలపై విచారణ



గ్రూపు సభ్యులను విచారణ చేస్తున్న అధికారులు

రాజాం సిటీ: రాజాం మున్సిపాల్టీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యులను అధికారులు సోమవారం విచారణ చేశారు. ఈ విచారణపై మెప్మా టీఎంసీ ఎస్వీ రత్నం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గ్రామానికి చెందిన ఇందిర ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులను అధికారులు శ్రీనివాసరావు, కృష్ణ, కిశోర్‌బాబులు విచారణ చేశారు. గతంలో గ్రామానికి చెందిన ఆర్పీ అవినీతి అక్రమాలకు పాల్పడిన విషయం విదితమే. ఇందుకు సంబంధించి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని సభ్యులను విచారణ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అప్పట్లో సభ్యులు విచారణకు సహకరించలేదు. మళ్లీ ఒక్కో గ్రూపును విచారణ చేసేందుకు అధికారులు నిర్ణయించి సోమవారం ఇందిరాగ్రూపు సభ్యులను విచారణ చేయగా రూ.5.40 లక్షల రుణం సీసీఎల్ (క్యాష్ క్రెడిట్ లోన్) మోడ్‌లో వాడుకున్నట్లు తేలింది.

బాల్య వివాహం నిలిపివేత



అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు ఎంపీటీసీ, సర్పంచ్

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేటలో ఈనెల 8వ తేదీన జరగాల్సిన బాల్య వివాహాన్ని వియ్యంపేట ఐసీడీఎస్ అధికారులు నిలిపివేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆకులసీతంపేటలో 15 ఏళ్ల అమ్మాయితో అదే గ్రామానికి చెందిన అబ్బాయితో నిశ్చయమైన వివాహం 8న జరగనున్నట్లు సమాచారం అందడంతో అధికారులు సోమవారం గ్రామానికి చేరుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీఓ పట్నాయక్, ఎస్సై రాజేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కామేశ్వరి, సర్పంచ్ సుంకరి రమణమ్మ, వైఎస్ఎంపీపీ అడపా ఈశ్వర్రావు, మహిళా పోలీసులు, ఆశ వర్కర్ల సమక్షంలో అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అమ్మాయికి 18 ఏళ్లు వచ్చేవరకు వివాహం చేయకూడదని, ఒకవేళ చేస్తే చట్టరీత్యా నేరమని వివరించారు. దీంతో సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామపెద్దలు, అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది సమక్షంలో వివాహం నిలిపివేస్తామని అబ్బాయి తల్లిదండ్రులు అంగీకరించడంతో వారితో అధికారులు అంగీకార పత్రం రాయించారు.

బడ్జెట్ కేటాయింపుల వినియోగం పుంజుకోవాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా
- బడ్జెట్‌పై ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో సమీక్ష



సీఎస్ ప్రదీప్‌కుమార్ జెనా అధ్యక్షతన సమావేశమైన ప్రభుత్వ శాఖల కార్యదర్శులు

భువనేశ్వర్: 'ఈ ఏడాది ఆదాయం ఆశాజనకంగా కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి ముగిసే నాటికి రాష్ట్రం ఆదాయం గణనీయంగా పెరిగింది. 2022 ఆఖరు నాటికి మొత్తం రాబడి సేకరణ గత ఆర్థిక సంవత్సరం కంటే దాదాపు 0.61% పుంజుకుంద'ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా వెల్లడించారు. బడ్జెట్ కేటాయింపుల వినియోగానికి పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు. స్థానిక లోక్‌సేవా భవన్‌లో ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో సోమవారం జరిగిన కీలక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. వివిధ శాఖల ఆర్థిక వనరుల సద్వినియోగంపై సమీక్షించారు. ఈ నేపథ్యంలో ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విశాల్‌కుమార్ దేవ్ బడ్జెట్ కేటాయింపుల వినియోగానికి ఆర్థిక నవీకరణలను వివరించారు. అన్ని ప్రభుత్వ చెల్లింపులు, రసీదు వ్యవస్థలను పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. నిధుల వినియోగ ధ్రువపత్రాలు సకాలంలో దాఖలు చేయడం అనివార్యంగా పరిగణించాలని తెలిపారు. 2022 ఫిబ్రవరి నాటికి రాష్ట్ర పన్ను వసూళ్ల ఆదాయం రూ.35,449 కోట్లకు పరిమితం కాగా.. ఈ ఏడాది రూ.40,876 కోట్లకు చేరుకుందని ప్రకటించారు. ఇది గత ఏడాది కంటే 15.31 శాతం అధికమని గుర్తుచేశారు. అలాగే ఈ వ్యవధిలో పన్నుయేతర(నాన్-టాక్స్) రాబడి 0.69 శాతం ప్రతికూలించినట్లు గణాంకాలు స్పష్టం చేశాయన్నారు. ఈ ఖాతాలో ఆదాయం రూ.78,916 కోట్లకు పరిమితమైందని, ఈ లెక్కన ఈ ఏడాది ఫిబ్రవరి ఆకరు నాటికి సమగ్ర ఆదాయం సగటున దాదాపు 0.61 శాతం పెరిగిందని పేర్కొన్నారు. మొత్తంగా రూ.1,29,037 కోట్ల ఆదాయంగా నమోదైందని వివరించారు. ప్రతికూల పరిస్థితుల్లో సైతం 0.61శాతం ఆదాయం పెరగడం విశేషమన్నారు. సమీక్షలో రాష్ట్ర అభివృద్ధి కమిషనర్, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అనూ గర్గ్, ఇతర శాఖల అదనపు చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు, స్పెషల్ సెక్రటరీలు పాల్గొన్నారు.

- ఆదాయ వనరుల పురోగతి దృష్ట్యా ఫిబ్రవరి చివరి నాటికి బడ్జెట్ కేటాయింపుల వినియోగం సంతృప్తికరంగా కొనసాగింది.
- ఈ నేపథ్యంలో 2022–23 ఆర్థిక సంవత్సరం కంటే దాదాపు 1.3 శాతం పురోగతి సాధ్యమైందని విశ్లేషణలో తేలింది.
- వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, మౌలిక సదుపాయాల రంగాల్లో బడ్జెట్ కేటాయింపుల వినియోగం ఆశాజనకంగా పెరిగింది.

మహిళా సాధికారతకు రాష్ట్రం నిలువుటద్దం



మాట్లాడుతున్న డీఎస్ఎస్ఓ మినాతీ దెయి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్లు పూర్తయిన ఇన్నాళ్లకు మహిళా సాధికారత, సామాజిక రూపాంతరీకరణను స్వయం సహాయక గ్రూపుల్లో చూస్తున్నామని కలెక్టర్ లింగరాజ్ పండా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం నవీన్ పట్నాయక్ మహిళల ఉన్నతికి 'మిషన్ శక్తి' అనే ప్రత్యేక శాఖనే ప్రారంభించారని తెలిపారు. అదే సమయంలో మహిళలు ఇంటి వద్దనే ఉండిపోకుండా స్వయం ఉపాధి పొంది, ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలకు అన్నింటా 50శాతం రిజర్వేషన్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి నవీన్‌కు దక్కిందని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికైన పురపాలక అధ్యక్షురాలు, సమితి అధ్యక్షురాలు, సభ్యులు, పంచాయతీ స్థాయిలో సర్పంచ్‌లే దీనికి ఉదాహరణగా అభివర్ణించారు. ఇటీవల జవహర్ నవోదయ విద్యాలయంలో మృతిచెందిన విద్యార్థిని సాధామని రైతోకు సంతాపంగా సభలో మౌనం పాటించారు. అలాగే ఏడీఎం సంగ్రాంశేఖర్, జిల్లా సామాజిక భద్రతా అధికారి మినోతి దెయి, సీడీఎంఓ డాక్టర్ పీకే పాత్రొ మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎస్ఆర్‌డీ సంఘం అధికారి నాగేశ్వర చౌదురి, ఒన్‌స్టాప్ సెంటర్ సంస్థలు, ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సాధామిని కుటుంబ సభ్యులు

- కలెక్టరేట్ వద్ద నవోదయ విద్యార్థిని తల్లిదండ్రుల ఆందోళన



విలేకర్లతో మాట్లాడుతున్న విద్యార్థిని తల్లి

పర్లాకిమిడి: జిల్లాలోని బెత్తగుడ వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో ఫిబ్రవరి 22న హాస్టల్‌లో ఉరి వేసుకుని మృతిచెందిన విద్యార్థిని సాధామిని కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థిని తల్లిదండ్రులు, అల్లాడ(కాశీనగర్) గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సాధామిని తల్లి రైతో విలేకర్లతో మాట్లాడారు. తమ కుమార్తెను హాస్టల్ అధికారులు, ఉపాధ్యాయులే హతమార్చారని ఆరోపించారు. ఘటన జరిగి 15 రోజులు పూర్తియినా పోలీసులు ఇంతవరకూ దర్యాప్తు చేయకుండా విద్యాలయం ప్రిన్సిపాల్ పక్షం వహిస్తున్నారని విమర్శించారు. సీపీఎం జిల్లా నాయకులు దండపాణి రైతో మాట్లాడుతూ మృతికి గల కారణాలను వెంటనే వెల్లడించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒకానొక సమయంలో ఆందోళనకారులు కత్తులు పట్టుకుని కలెక్టరేట్ గేటు ఎక్కేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని, అడ్డుకున్నారు. అనంతరం కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి అక్కడికి చేరుకొని, ఆందోళనకారులతో మాట్లాడటంతో ధర్నా విరమించారు.

హోలీపై ఆంక్షలు

- రసాయన రంగుల విక్రయాలు నిషేధం

భువనేశ్వర్: కటక్ నగరంలో హోలీ సందర్భంగా ప్రత్యేక ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా రసాయన రంగుల విక్రయం, వినియోగాన్ని నివారించారు. సంప్రదాయ రంగులు మాత్రమే వినియోగానికి అనుమతించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపడతామని పోలీసులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ పట్ల ప్రత్యేక నిఘా ఉండాలని అనుబంధ సిబ్బందికి ఆదేశించారు. హోలీ సందర్భంగా మత్తు పానీయాల ప్రభావంతో అలజడి రేపే వర్గాల పట్ల కన్నేసి ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో కమిషనరేట్ పోలీసులు భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. కటక్ నగరం 6సెక్టార్లుగా విభజించి 15 ప్లాటూన్ బలగాలను మోహరించారు. కటక్ నగరంలో సెక్టార్ వారీగా ఏసీపీలు బందోబస్తులో నిమగ్నమై ఉంటారు. ప్రధాన కూడళ్లలో తాత్కాలిక పోస్టులు ఏర్పాటు చేస్తారు. 22 పోలీసు వ్యాన్‌లు, 40 బైక్ పోలీసులను జోన్ వారీ పోలీస్ స్టేషన్లలో పహరాకు వినియోగిస్తారు. నగర డీసీపీ పినాక్‌మిశ్రా, ఇద్దరు అడిషనల్ డీసీపీ స్థాయి అధికారులు నగర వ్యాప్తంగా హోలీ శాంతిభద్రతల వ్యవహారాలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. రంగుల కేళి తర్వాత స్నానాలు సందర్భంగా ప్రమాదాల నివారణకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. నగరంలోని మహానది, కఠాజోడి వంటి ప్రముఖ నదీ తీరాల్లో ప్రత్యేక సహాయక, పునరుద్ధరణ బలగాలు నియమించారు. అగ్నిమాపకం, ఒడిశా విపత్తు స్పందన ఒడ్రాఫ్ దళాలు అనుబంధ సరంజామాతో నదీ తీరాల్లో అప్రమత్తంగా ఉన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తులపై కేసు

విజయనగరం క్రైమ్: ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని సున్నంబట్టీవీధికి చెందిన చిప్పాడ సంతోష్ కుమార్..డీఎంహెచ్ఓ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్ నోటిఫికేషన్‌కి సంబంధించి దరఖాస్తు చేసుకున్నాడు ఆ నోటిఫికేషన్‌కు సంబంధించి ఉద్యోగమిప్పిస్తానని, తమకు అధికారులందరూ బాగా తెలుసునంటూ శివ, అనిల్ అనే ఇద్దరు వ్యక్తులు సంతోష్‌కుమార్‌కు నమ్మించి గత ఏడాది ఆగస్టు నెలలో రూ 2 లక్షలు తీసుకున్నారు. అలాగే సంతోష్ కుమార్ ఇద్దరు స్నేహితుల దగ్గ చెరో రూ. 2 లక్షలు మొత్తం ముగ్గురి దగ్గర రూ.6 లక్షలు తీసుకున్నట్లు బాధితులు ఫిర్యాదుచేశారు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు తెలిపారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి



రేగిడి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపికా ఎం. పాటిల్

రేగిడి: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాతోపాటు వినియోగదారులపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్పీ దీపిక ఎం అన్నారు. యువత గంజాయి వినియోగానికి బానిసలవుతుండడంతో దీనిని సవాల్‌గా తీసుకున్నామన్నారు. సోమవారం మండల పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీకి వచ్చిన ఆమె ఈ మేరకు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇంతవరకు 19 చోట్ల గంజాయి పట్టుబడగా 46 మందిపై కేసులు నమోదు చేశామని వెల్లడించారు. దీనిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి పంటలు, ఇళ్లలో ప్రత్యేకంగా గంజాయిని పండించినా అక్రమ రవాణాపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందని తెలిపారు.

చిట్టీల మోసం పట్ల అప్రమత్తం

చిట్టీల పేరుతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కొంతమంది ఏజెంట్లు చిట్టీల కంపెనీల్లో పనిచేస్తున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిట్టీలు నడిపేవారు, ఏజెంట్లుగా పనిచేసిన వారు ఇద్దరూ నేరస్తులవుతారని హెచ్చరించారు. జిల్లాలో కుల దూషణ కేసులు తగ్గాయని, వరకట్న వేధింపులు, భార్యాభర్తల మధ్య తగాదాలు పెరిగాయని, సచివాలయాల పరిధిలో మహిళా పోలీసులు ఇటువంటి వాటిని ముందే గుర్తించి తగిన కౌన్సిలింగ్ ఇస్తూ పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో చలివేంద్రం, షటిల్ కోర్టును ప్రారంభించడంతోపాటు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, కేసుల పరిష్కారం, సిబ్బంది పనితీరుపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు, ఎస్సై ఇ. శ్రీనివాసరావు, సంతకవిటి ఎస్సై జనార్దనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు వినతులు



రాయగడ: వినతులు స్వీకరిస్తున్న అధికారులు



పర్లాకిమిడి: గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ లింగరాజ్ పండా

రాయగడ: జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ ప్రధాన్ ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వారి సమస్యలను తెలియజేశారు. ఇందులో మొత్తం 51 వినతులను అధికారులు స్వీకరించగా, 43 వ్యక్తిగత వినతులు కాగా.. మరో 8 గ్రామ సమస్యలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్-2 ధర్మానంద బెహరా, జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి రవినారాయణ త్రిపాఠి, ఎస్‌డీపీఓ దేవజ్యోతి దాస్, సబ్ కలెక్టర్ భీమసేన్ సాబోరో తదితరులు పాల్గొన్నారు. స్వీకరించిన వినతులను సకాలంలో పరిష్కరించాలని ఈ సందర్భంగా ఏడీఎం సోమనాథ్ ఆదేశించారు.

పర్లాకిమిడిలో 85..

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని పాలనాధికారి సమావేశ మందిరంలో గ్రామముఖి పరిపాలన, గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. కలెక్టర్ లింగరాజ్ పండా, ఏడీఎం సంగ్రాంశేఖర పండా, ఎస్పీ స్వాతి ఎస్. కుమార్, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి రమాంచల్ ఖమారి, డీఎఫ్ఓ ఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్లాకిమిడి మున్సిపాలిటీ పరిధితో పాటు రాణిపేట, బాగుసల, సిద్ధమణుగు, కెరండి, కత్తలకవిటి పంచాయతీల నుంచి 85వినతులు అధికారుల దృష్టికి వచ్చాయి. వాటిలో వ్యక్తిగతం 75, 19 వివిధ ఆరోపణలు, గ్రామ సమస్యలపై 10 ఉన్నాయి. వీటిని వెంటనే సంబంధిత శాఖలు పరిష్కరించాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. గ్రీవెన్స్‌లో వివిధ ప్రభుత్వ ఉన్నతాధికారులు, నోడల్ అధికారి నర్మదా నాయక్, అదనపు ఎస్పీ వామదేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

11టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



బాడంగి: ఆకులకట్ట వద్ద విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన బియ్యం వ్యాన్లు, డ్రైవర్లు



రాజాం: పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

- నిందితులపై కేసు నమోదు

బాడంగి: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడి చేసి పెద్దమొత్తంలో అక్రమంగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు.వారికి అందిన సమాచారంతో ఉదయం 6 గంటలకే మండలంలోని ఆకులకట్ట జంక్షన్ మాటువేశారు. 11గంటల సమయంలో నాలుగు టాటా ఏస్ వ్యాన్లలో సుమారు 11.635 టన్నుల బియ్యం తరలిపోతుండగా అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యం పిరిడి, గొల్లపల్లికి చెందిన వ్యాపారస్తులవిగా తెలుసుకున్నారు. శ్రీకాకుళానికి చెందిన రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సైలు ఎన్ అశోక్ చక్రవర్తి, బి.రామారావులు సిబ్బందితో కలిసి మాటువేసి పట్టుకున్న బియ్యాన్ని సీఎస్‌డీటీ జీవీ.భాస్కరరావు సమక్షంలో తెర్లాం ఎంఎల్ఎస్ గిడ్డంగికి చేరవేశారు. నిందితులపై 6ఎ కేసులు నమోదుచేసి ఖాళీ వ్యాన్‌లను బాడంగి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. వ్యాన్ డ్రైవర్లలో కె.శంకరరావుది మెరముడిదాం కాగా ఆర్.అశోక్, నాగరాజు, సూర్యారావులది పిరిడి గ్రామంగా వారు చెప్పారు. దాడిలో తహసీల్దార్ బాలమురలీకృష్ణ పాల్గొని విజిలెన్స్ అధికారులకు సహకరించారు.

మరో 1100 కేజీల బియ్యం..

రాజాం సిటీ: మండల పరిధి రామానుజులపేట గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్సై బి.రామారావు, ఎ.అశోక్‌చక్రవర్తి, సీఎస్‌డీటీ చిరంజీవిరావులకు అందిన సమాచారం మేరకు సోమవారం గ్రామాన్ని సందర్శించారు. బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన ఇంటిపై దాడి చేసి 1100 కేజీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మున్సిపాల్టీ పరిధి సారధి గ్రామానికి చెందిన కందుల శ్రీనివాసరావుపై 6 ఎ కేసు నమోదుచేశారు.

నేరాల నియంత్రణకు కృషి చేయండి

- ఎస్ఈబీ ఏఎస్పీ ఆస్మాఫర్హీన్



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ ఆస్మాఫర్హీన్

బొబ్బిలి రూరల్: నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్ఈబీ ఏఎస్పీ ఆస్మాఫర్హీన్ సూచించారు. సోమవారం స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌ను సందర్శించిన ఆమె తొలుత అక్కడి రికార్డులు, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశమైన ఆమె సారా తయారీ, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పడి, ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. సిబ్బంది పనితీరు, నేరాల నియంత్రణకు వారు తీసుకుంటున్న చర్యలపై ఏఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట సీఐ ఆర్.జైభీమ్, ఎస్ఐ చిన్నంనాయుడు ఉన్నారు.

ఆటో,బైక్ ఢీ:ముగ్గురికి తీవ్ర గాయాలు



పార్వతీపురం: చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



జామి: ప్రమాదంలో గాయాల పాలైన యువకులు

పార్వతీపురం: గుమ్మలక్ష్మీపురం మండలం కేదారిపురం గ్రామం వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండల తోట గ్రామానికి చెందిన మండంగి చంటి, నిమ్మక జోగేష్, బి.గోపాల్‌లు ఒడిశాలోని గుణుపూర్‌వద్ద జరిగే జాతరను చూసేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి 2 గంటల సమయంలో బయలుదేరి ద్విచక్రవాహనంపై వస్తుండగా కేదారిపురం దాటిన తరువాత వెనుకనుంచి వచ్చిన ఆటో ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ముగ్గురు తుప్పల్లోకి జారిపడి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తును నిర్వహిస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి..

జామి: మండలకేంద్రం జామి మాధవరాయి మెట్ట సమీంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. సోంపురం గ్రామానికి చెందిన జి.బాలాజీ గ్రామం నుంచి జామి వైపు బైక్‌పై వస్తుండగా బానాది గ్రామానికి చెందిన పి.కార్తీక్ జామినుంచి ఎస్.కోట వైపు బైక్‌పై వెళ్తున్న సమయంలో మాధవరాయిమెట్ట కాలనీవద్ద ఇద్దరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో కింద పడి తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో విజయగనరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

కోళ్ల మృతిపై విచారణ


విచారణ చేస్తున్న ప్రజ్ఞ చైతన్య

కోటబొమ్మాళి: కోళ్ల మృతిపై పశువైద్యాధికారులు విచారణ చేపట్టారు. 'వింతవ్యాధితో కోళ్ల మృతి' శీర్షికతో 'సాక్షి' దినపత్రిక లో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన తిలారు పశువైద్యాధికారి మెండ ప్రజ్ఞ చైతన్య, వెటర్నరీ అసిస్టెంట్ కె.మహేష్ విశ్వనాధపురం గ్రామంలో విచారణ చేపట్టా రు. కొండాల శిమ్మయ్యకు చెందిన 40 కోళ్లు మృతి చెందడంతో అతన్ని కలిసి వివరాలు సేరించారు. అలాగే పలు గ్రామాల్లో కోళ్ల పెంప కం దారులను విచారించారు. వాతావరణంలో వేడి తీవ్రత పెరగడమే కోళ్ల మృతికి కారణంగా భావిస్తున్నామన్నారు. నివారణ కోసం గ్రామాల్లో పర్యటించి కోళ్లకు టీకాలు వేస్తామని కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద లోకనాథం తెలిపారు.

విదేశీ ఉన్నత విద్యపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్య చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్య మంచి అవకాశమని రీసోర్సుపర్సన్ గౌతం అన్నారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో విదేశాల్లో ఉన్నత విద్యపై ఇంజినీరింగ్ విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విదేశాల్లో ఉన్నత విద్య డిగ్రీలు సాధన ద్వారా అక్కడి వేజ్‌బోర్డు మేరకు మెరుగైన వేతనాలు లభిస్తాయని చెప్పారు. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్ వంటి విదేశాల్లో మన విద్యార్థులు ఉద్యోగాలు చేసేందుకు, ఉన్నత విద్య చదివేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వాలు సైతం విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయన్నారు. సీటు సంపాదనకు సరిపడే విషయ పరిజ్ఞానం, ఇంటర్వ్యూకు తగిన నైపుణ్యం అవసరమ న్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీవీఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపా ల్ ఎస్‌వీసీ రమణ మూర్తినాయుడు, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈవీ నాగోజీ పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ కార్యక్రమంపై సమీక్ష

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి ఆధ్వర్యంలో జిల్లా కో ఆర్డినేటర్స్ డోల శ్రీను, భగత్‌లు హాథ్ సే హాథ్‌పై సోమవారం సమీక్ష నిర్వహించారు. చేయి చేయి కలుపుదాం- కాంగ్రెస్ పార్టీని బలపరుద్దాం కార్యక్రమాన్ని జనవరిలో ప్రారంభించడం జరిగిందన్నా రు. మార్చి నెలాఖరు వరకు అన్ని నియోజకవర్గా ల్లో కార్యక్రమాన్ని నిర్వహించాలని కోఆర్డినేటర్లు పార్టీ నాయకులకు సూచించారు. డీసీసీ అధ్యక్షురా లు సత్యవతి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడోయాత్ర స్ఫూర్తి తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు సనపల అన్నాజీరావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవే శాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జల్లు లక్ష్మణమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల నాలుగో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని, ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగు తరగతి చదువుతున్నవారు పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. తెలుగు, ఇంగ్లిషు, లెక్కలు, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై 50 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలుంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివిన వారై ఉండాలన్నారు. బీసీ, ఈబీసీ విద్యార్థులు 2012 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి తొమ్మిది నుంచి 11 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ ఒకటి నుంచి 2104 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి తొమ్మిది నుంచి13 సంవత్సరాల మధ్య ఉన్న వారు అర్హులన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్ష మించరాదన్నారు. జిల్లాలో బాలబాలికల కోసం 11 పాఠశాలలు ఉన్నట్టు చెప్పారు. అర్హులైన వారు సోమవారం నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంపోలు బాలురు గురుకులంలో 80, అక్కుపల్లి (మత్స్యకార బాలురు)-40, నరసన్నపేట (బాలురు)-40, నిమ్మాడ (బాలురు)-40, సంతబొమ్మాళి (బాలురు)-40, లోలుగు (బాలురు)-40, టెక్కలి (బాలికలు)-80, శ్రీకాకుళం (బాలికలు)-40, పలాస (బాలికలు)-40, పాతపట్నం (బాలికలు)-40, ఆమదాలవలస (బాలికలు)-40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

శ్రీకాకుళం న్యూకాలనీ: లావేరు మండలం భీమునిపాలెం ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు (ఎస్‌జీటీ) బి.మోహనరావును అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీ చేశారు. విధుల నిర్వహణలో అలసత్వం, విద్యార్థులకు కనీసం పాఠాల బోధన చేయడం లేదని, ప్రీప్రైమరీ విద్యార్థుల్లో కనీస ప్రమాణాల లేనట్టు అధికారులు గుర్తించారు. అలాగే టీచర్ డెయిరీ, లెస్సన్ ప్లాన్‌ను తయారు చేయని విషయాన్ని గుర్తించిన అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోహనరావును సస్పెండ్ చేస్తూ డీఈవో పగడాలమ్మ సోమవారం ఉత్తర్వులు వెలువరించారు.

జీడితోటల్లో మంటలు


జి.సిగడాం: అగ్ని ప్రమాదంపై ఆరా తీస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: జీడి తోటల్లో చెలరేగిన మంటలు ఆర్పుతున్న రైతులు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జీడి తోటలకు నిప్పు అంటుకుంది. గ్రామానికి తూర్పు దిక్కున సముద్ర తీరానికి ఆనుకుని ఇసుక దిబ్బలపై ఉన్న 16 మంది రైతులకు చెందిన 50 ఎకరాల్లోని జీడి పంట అగ్నికి ఆహుతైంది. పూత, పిందె దశలో పచ్చగా ఉన్న తోటల్లో మంట రాజుకోవడంతో సమస్తం బూడిదైపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మంటల వ్యాప్తికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదు. ఉదయాన్నే రైతులు తమ జీడి తోటల్లో పనులు చేసుకుని మధ్యాహ్నం ఇళ్లకు వచ్చారు. తిరిగి తోటలకు వెళ్లే సమయంలో నౌపడ నారాయణ అనే రైతు మంటలు గమనించి అందరినీ అప్రమత్తం చేశారు. దీంతో రైతులు హుటాహుటిన తోటలకు చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే దాదాపు 50 ఎకరాలకు మంట వ్యాపించేసింది. తిత్లీ సమయంలో నేలకూలిన చెట్లు ఇప్పుడిప్పుడే వికసిస్తున్నాయని, ఈ అగ్ని ప్రమాదంతో మళ్లీ దెబ్బ తిన్నామని దున్న చిరంజీవులు, డీజే అప్పన్న, కె.ఢిల్లీరావు, ఎం.జనార్దనరావుతో మరికొందరు రైతులు వారి కుటుంబ సభ్యులు కన్నీమున్నీరయ్యారు. దగ్ధమైన జీడి తోటలను వీఆర్‌ఓ కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి సుధారాణి సచివాలయ ఉద్యానవన శాఖ అసిస్టెంట్ ప్రశాంత్, సర్వేయర్ సోమేశ్వరరావులు పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సర్పంచ్ దున్న రత్నం బాలరాజు రైతులను ఓదార్చి రైతుల పరిస్థితిని తహసీల్దార్ బి. అప్పలస్వామి, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

బాతువలో..

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో 50 ఎకరాల జీడితోట దగ్ధమైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌ను ఆనుకుని 50 ఎకరాల జీడితోటలో ప్రమాదం జరిగిందని, 24 మంది రైతులకు చెందిన 50 ఎకరాలు దెబ్బతిన్నాయని తెలిపారు. రైతుల నుంచి సమాచారం అందుకున్న రాజాం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. జి.సిగడాం వీఆర్‌ఓ భూపతి నర్సింగరావు తోటల వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు.

రిజర్వ్ ఫారెస్టుకు..

కాశీబుగ్గ: పలాస మండలం రామకృష్ణాపురం రెవెన్యూ పరిధికి ఆనించి ఉన్న రిజర్వ్ ఫారెస్టుకు సోమవారం నిప్పంటుకుంది. దాదాపు 30 ఎకరాల వరకు మంటల తీవ్రత ఉన్నట్లు సమాచారం. దీనిపూ కాశీబుగ్గ ఫారెస్టు రేంజర్‌కు ఏఎంకే నాయుడుకు సమాచారం అందించడంతో ఫారెస్టు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. పలాస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు చేరుకున్నప్పటికీ వాహనం వెళ్లే అవకాశం లేకపోవడంతో వెనుదిరిగారు. ఇక్కడ పేకాట ఆడేవారు విసిరేసిన సిగరెట్ల వల్ల ఎండుటాకులు మండి మంటలు అంటుకుని ఉంటాయని భావిస్తున్నారు.

ఎన్జీఓ హోమ్‌లో ఉత్సాహంగా క్రీడా పోటీలు


ఆటలాడుతున్న మహిళలు, విద్యార్థినులు

శ్రీకాకుళం అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ఎన్జీఓ సంఘ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల క్రీడా పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళంలోని ఎన్జీఓ హోమ్‌లో జరిగిన ఈ పోటీలను ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. తొలిరోజు లెమన్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ తదితర క్రీడలను నిర్వహించగా, పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు పాల్గొని ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ ఏటా మహిళా దినోత్సవాలను తమ సంఘ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వస్తున్నామని గుర్తుచేశారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులు, సిబ్బందికి క్రీడాపోటీలు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. మహిళా దినోత్సవాల్లో ఉద్యోగినులు పాల్గొనే విధంగా వారికి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ రెండో పూట అనుమతిచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, సంఘ నాయకులు బడగల పూర్ణచంద్రరావు, రాజకుమార్, మాదారపు డేవిడ్, బొత్స శ్రీనివాసరావు, మహిళా విభాగం నేతలు కె.రోజాకుమారి, మమతా బెహరా, పి.శ్రావణి, జి.లలిత, హైమావతి, సబీనా బేగం, నారాయణమ్మ, దేదీప్య తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి మల్లన్న ఆదాయం రూ.7,87,331


టెక్కలి మండలం రావివలసలో మల్లన్న ఆలయంలో ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

టెక్కలి: గత నెలలో మహా శివరాత్రి సందర్భంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామి దేవస్థానంలో నిర్వహించిన ఉత్సవాల నేపథ్యంలో రూ.7,87,331ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వీవీఎస్ నారాయణ వెల్లడించారు. ఆయన సోమవారం మల్లన్న ఆలయ ప్రాంగణంలో హుండీతో పాటు ఇతర ఆదాయాలను లెక్కించారు. శీర్షాభిషేకం టికెట్‌ల ద్వారా రూ.2,32,920, శీఘ్ర దర్శనం ద్వారా 2,03,820, కేశ ఖండన టికెట్‌ల ద్వారా రూ.8,475, తాత్కాలిక, శాశ్వత హుండీల ద్వారా రూ.3,42,116 కలిపి మొత్తం రూ.7,87,331 ఆదాయం వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. గత ఏడాది రూ.7,38,414 ఆదాయం వచ్చిందని, గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.48,917 వచ్చిందని తెలిపారు. పాతపట్నం నీలమణి దుర్గా ఆలయం ఈఓ టి.వాసుదేవరావు, మల్లన్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళలు తమ భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలోని న్యాయ సేవా సదన్‌లో సోమవారం డీఆర్‌డీఏలో మహిళా కార్యకర్తలు, వైద్యశాఖ అధి కారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బందితో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు న్యాయ సహాయం కావాల్సి వస్తే జిల్లాన్యాయ సేవాధికార సంస్థ సాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అన్నెపు సత్యనారాయణ, మెట్ట సత్యనారాయణ రిసోర్స్ పర్సన్లుగా మహిళలకు అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్ కుమార్ డిప్యూటీ డీఎంహెచ్ఓ అనురాధ న్యాయవాది ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై డీఈఓ విచారణ


గంగువాడ హైస్కూల్‌లో సోమవారం రాత్రి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

పాతపట్నం: మండలంలోని తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సాయంత్రం ఆరుగంటల సమయంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ పరిశీలించారు. ఇటీవల మధ్యాహ్నం భోజనం సరిగా వండడం లేదని, మెనూ పాటించడం లేదని, రికార్డులను సరిగా లేవని విద్యార్థులు ఆరోపించారు. అలాగే ఏవీబీపీ విద్యార్థులు పాఠశాలపై పలు ఆరోపణలు చేయడంతో సోమవారం సాయంత్రం డీఈఓ పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు, హెచ్ఎం ఎవరూ లేకపోవడంతో వారికి ఆమె ఫోన్ చేసి రప్పించారు. మధ్యాహ్న భోజనంపై ప్రధానోపాధ్యాయుడు అగమూడి రమేష్‌ను వివరణ కోరారు. అయితే ఆయన సమాధానం చెప్పలేకపోవడంతో డీఈఓ అసహనం వ్యక్తం చేశారు. అలాగే గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాత్రిళ్లు టెన్త్ విద్యార్థులు చదువుతుండడంతో డీఈఓ రాత్రి వెళ్లి పరిశీలించారు.


● కోరికల నాశనమే

కామదహనం

● ప్రారంభమైన శ్రీకూర్మనాథుని డోలోత్సవాలు

గార: మానవుల కోరికలు నశింపజేసేందుకే కామదహనోత్సవం శ్రీకూర్మం క్షేత్రంలో నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు పేర్కొన్నారు. ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం శ్రీకూర్మంలో సోమవారం సాయంత్రం నుంచి డోలోత్సవాలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా స్వామి తిరువీధి, కామదహనోత్సవం కన్నుల పండువగా జరిగింది. ముందుగా కూర్మనాథస్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి, గోవిందరాజస్వామి, సీతారామలక్ష్మణల విగ్రహాలను, అశ్వ, శేష, పల్లకి వాహనాలపై మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య తిరువీధి నిర్వహించారు. ఆలయ దక్షిణ మంటపం నుంచి బయలుదేరిన తిరువీధి కామదహన మంటపానికి చేరుకుంది. మంటపం వద్ద ముందుగా ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రదేశంలో అర్చకులు గోపినం బాళ్ల నల్లకూర్మన్నాచార్యులు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు తదితరులు విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, హోమం నిర్వహించారు. పుణ్యాహవచనం చేసిన శుద్ధ జలంతో ముందుగా నాటిన కొబ్బరి కొమ్మను వేదపండితులు శుద్ధి చేశారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య అగ్ని తీసి ప్రధానార్చకులు కామదహనాన్ని ప్రారంభించారు. అనంతరం అశ్వ, శేష, పల్లకి వాహనాలపై ఉన్న స్వామి ఉత్సవమూర్తులను మూడు ధపాలు ప్రదక్షిణ చేయించారు. అనంతరం కామ దహనంలో ఏర్పడిన యజ్ఞ భస్మానికి తీసుకునేందుకు భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.గురునాథం, వైస్ ఎంపీపీ అందవరపు రామలక్ష్మి, సర్పంచ్ గోరు అనిత, పాలక మండలి సభ్యులు డబ్బీరు వాసుదేవరావు, అనుపోజు నాగరాజు, ఉప్పాడ రవికుమార్, పొన్నాడ రుషి, ముంజేటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. డోలోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం పడియలో భాగంగా భక్తులు సముద్ర స్నానాలు చేస్తారు. అనంతరం శ్వేత పుష్కరిణిలో స్నానాలు చేసి స్వామిని దర్శించుకుంటారు.

8న మహిళా సదస్సు


చింతాడ మంజు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మహిళా సదస్సు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఇతర ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి మహిళా నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, మండల మహిళా విభాగం కార్యవర్గం, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మహిళా చైర్మన్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి


నిర్వాహకులతో క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడలు ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను క్రీడల్లో పోత్సహించాలని సూచించారు. పోటీల్లో మహిళల విభాగంలో సానివాడ, ఎచ్చెర్ల, పురుషుల విభాగంలో నరసన్నపేట, ఎచ్చెర్ల జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీన బహుమతులు ప్రదానం చేస్తారు.

కొత్తూరులో అగ్ని ప్రమాదం

● రూ. 1.50 లక్షల నష్టం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొత్తూరు: కొత్తూరు కుమ్మరివీధిలో ఉంటున్న సారిపిల్లి కృష్ణవేణికి చెందిన నిర్మాణంలో ఉన్న ఇంట్లో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇంట్లో ఉంచిన పశువుల దాణా, విలువైన కలప, మరికొన్ని సామాన్లు కాలిబూడిదయ్యాయి. అలాగే శ్లాబుతో పాటు గోడలు బీటలు వారాయి. సుమారు రూ. 1.50 లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి రమణమూర్తి తన సిబ్బందితో హుటాహుటీన చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రమేష్, వడమ శ్రీనివాసరావు, రంజిత్, నాగేశ్వరరావు, పడాల వెంకటకృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మత్తుకు బానిస కావొద్దు


మాట్లాడుతున్న సీఐ నాగేశ్వరరావు

శ్రీకాకుళం క్రైం: యువత, విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక దమ్మల వీధి సమీపంలోని లెప్రసీ కాలనీలో మత్తు పదార్థాల వినియోగం కలిగే అనర్థాలు, చట్టం తీవ్రతపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల క్రయ విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14500 కు తెలియజేయాలని కోరారు. జిల్లా కేంద్రంగా చేసుకొని విద్యార్థులు అధికంగా గంజాయితో కూడిన స్మోకింగ్ చేస్తున్నారన్న సమాచారం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సీఐ చెప్పారు. కార్యక్రమంలో కన్నబాబు, వార్డు మెంబర్లు, సెబ్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రైమ్‌కార్నర్

చెరువులో పడి వివాహిత మృతి


తులసమ్మ మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై రమేష్‌బాబు

టెక్కలి రూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వివాహిత మృతి చెందింది. ఈ సంఘటన అయోధ్యపురం గ్రామంలో చోటుచేసుకోగా.. అదే గ్రామానికి చెందిన గొల్లపల్లి తులసమ్మ (42) ప్రాణాలు కోల్పోయింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తులసమ్మ గ్రామ సమీపంలో పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో ఉన్న చెరువులోకి కాళ్లు, చేతులు కడుక్కోవడానికి దిగి నీటిలో పడిపోయింది. గుర్తించిన స్థానికులు అమెను చెరువు నుంచి బయటకు తీశారు. విషయాన్ని ఆమె భర్త, పీఏసీఎస్ డైరెక్టర్ తేజేశ్వరరావుకి సమచారం ఇచ్చారు. హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని తుసమ్మను ఇంటి వద్దకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే అమె మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్సై-2 రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పుట్టింట్లో అడుగు పెట్టేందుకు వెళ్తూ..

● ఆటో బోల్తాపడి నలుగురి గాయాలు


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి గ్రామానికి చెందిన జి.చంద్రమ్మ భర్త ఇటీవల మృతి చెందారు. దీంతో 11వ రోజు కార్యక్రమాల అనంతరం టెక్కలిలోని తన పుట్టింట్లో అడుగు పెట్టేందుకు బంధువులు సావిత్రమ్మ, కె.పార్వతిలతో కలిసి ఆటోలో సోమవారం వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. సంతబొమ్మాళి గ్రామానికి చెందిన వరుసకు కుమారుడైన గాసి భాస్కర్ ఆటోలో చంద్రమ్మ తదితరులు వస్తుండగా టెక్కలి సమీప శ్యామసుందరాపురం గ్రామ అప్రోచ్ రోడ్డులో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఆటో డ్రైవర్‌తో పాటు ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు వినోద్ వైద్యపరీక్షలు చేశారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసునమోదు చేశారు.

ఉద్యోగం పేరుతో మోసం చేశారని ఫిర్యాదు

సారవకోట: ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ 1.60 లక్షలు తీసుకున్నట్లు అలుదు గ్రామానికి చెందిన తంగుడు వెంకటరావు సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు. పాతపట్నం మండలం కొరసవాడ గ్రామానికి చెందిన తూముల సంతోషకుమార్, తూముల తవుడులతో పాటు తెలంగాణకు చెందిన మట్టం విశ్వేశ్వరరావులు టెక్ మహేంద్ర కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు పేర్కొన్నారు.

క్షయవ్యాధిగ్రస్తుల పౌష్టికాహారానికి విరాళం


చెక్కును అందజేస్తున్న డాక్టర్ అనూరాధ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న క్షయవ్యాధి నివారణ, నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించేందుకు ఏ-1 ఆస్పత్రికి డాక్టర్ ఎ.ప్రమీల ఒకలక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా టీబీ వెల్ఫేర్ అధికారి డి ఎన్.అనూరాధ చేతుల మీదుగా చైర్మన్ జగన్మోహనరావుకు సోమవారం అందజేశారు. ఆర్ఫ్ సంస్థ ప్రతినిధి సన్యా సిరావు, ఇంటాక్ సభ్యులు జగన్నాథంనాయడు, రాధాకృష్ణ, నటుకుల మో హన్, సురంగి మోహనరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు పాల్గొన్నారు.

అరసవల్లిలో కామదహనోత్సవం


కామదహనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో డోలోత్సవ సంబరాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయం ఉద్యానవనతోటలో రాత్రి కామదహనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉషా పద్మిని ఛాయాదేవి సమేతంగా సూర్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను ఉద్యానవన మండపంలో వేంఘేసింప జేసి ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వంశధార జలాశయం నుంచి నీరు విడుదల


వంశధార రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న ఇంజినీర్ అధికారులు

హిరమండలం: వంశధార రిజర్వాయర్ (జలాశయం) నుంచి గొట్టా బ్యారేజీలోకి 500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు వంశధార, గొట్టాబ్యారేజీ ఏఈలు భరత్ రెడ్డి, పరిషత్ బాబు బి.సత్యనారాయణ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు ఆదేశాల మేరకు జలాశయం నుంచి 500 క్యూసెక్కుల నీటిని కుడి ప్రధాన కాలువతో పాటు బ్యారేజీ నుంచి ఎడమ ప్రధాన కాలువ ద్వారా 250 క్యూసెక్కుల చొప్పున సాగునీరు విడుదల చేశామన్నారు. రైతులు ఈ రబీ సీజన్‌లో సాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ముందుగా గ్రామాల్లోని చెరువులను నింపుకుని స ద్వినియోగం చేసుకోవాలని కోరారు.